జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
కరీంనగర్
జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి
శుక్రవారం | 27 | సెప్టెంబర్ | 2024 ◆ పేజీలు : 2



## ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం రేవంత్ రెడ్డి ఫొటో తప్పనిసరి



*జమ్మికుంట, సెప్టెంబర్26, ప్రజా జ్యోతి*

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లు, డివిజన్, మండల, అధికారులకు గురువారం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.. ప్రభుత్వం ఫైనల్ చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటోను ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రదర్శించాలని కాంగ్రెస్ సర్కార్ ఆదేశించింది. అక్టోబర్ 7వతేదీలోపు అన్నిప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి కొత్త ఫోటో ఏర్పాటు చేయాలని కోరింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లు, డివిజన్, మండల అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.





# మా షాపులు మాకు ఇవ్వాలి...

**సిరిసిల్లలో తాజా మాజీ రేషన్ డీలర్ల ఆందోళన**

**పెట్రోల్ బాటిళ్లతో వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన**

**రేషన్ డీలర్ల నియామకాల్లో అక్రమాలపై విచారణ జరపాలని డిమాండ్**


*రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 26, ప్రజాజ్యోతి*

తమ దుకాణాలు తమకే ఇవ్వాలని, కేటాయించిన డీలర్ల పోస్టులు రద్దు చేయాలని సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తాజామాజీ రేషన్ డీలర్లు ఆందోళనకు దిగారు. రేషన్ డీలర్ల నియామకాల్లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు షాపులు కోల్పోయిన 17 మంది డీలర్లు గురువారం సిరిసిల్ల సాయినగర్ వద్ద మంచినీటి ట్యాంకు ఎక్కి, పెట్రోలు బాటిళ్లు చేత పట్టుకుని మండుటెండల్లో మూడు గంటల పాటు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ డీలర్లు తాటి పద్మ, మమత, కొండ పద్మ, శారద, రేణ మాట్లాడారు. గత ప్రభుత్వం మహిళా సంఘాలకు ఇచ్చిన దుకాణాలను 12 ఏండ్లుగా నడుపుకుంటున్నామని తెలిపారు. అధికారులు తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే దుకాణాలకు నోటిఫికేషన్ వేసి, పరీక్షలు నిర్వహించారని, డీలర్ షిప్‌లను రద్దు చేసి, మరొకరికి కట్టబెట్టారన్నారు. తమ జీవనోపాధి పోయిందని, బతుకుదెరువులేక ఇక చావే గతి అంటూ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోశారు. కాంగ్రెస్ నాయకులు దుకాణాలను పైసలకు అమ్ముకుని అన్యాయం చేశారని ఆరోపించారు. అర్ధరాత్రి తహసీల్దార్ కార్యాలయంలో నియామకపు పత్రాలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. సాయంత్రం 5గంటలు దాటితే టైం అయిపోయిందంటూ కసురుకునే అధికారులు రాత్రి వేళల్లో కార్యాలయాలకు వచ్చి లీడర్లకు నియామక పత్రాలు అందజేయడంలో ఆంతర్యమేమిటని నిలదీశారు. రేషన్ షాపులపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకునే వరకు ట్యాంకు దిగమంటూ భీష్మించుకుని కూర్చున్నారు. ఏఎస్పీ చంద్రయ్య ఘటన స్థలానికి చేరుకుని సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని ఎంత నచ్చచెప్పినా వారు వినిపించుకోలేదు. తమకు జరిగిన అన్యాయంపై కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించినా ఏమాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. తహసీల్దార్ షరీఫ్ వచ్చి కలెక్టర్ అందుబాటులో లేరని, వినతి పత్రం ఇస్తే కలెక్టర్‌కు ఇస్తానని చెప్పడంతో శాంతించి ఆందోళన విరమించారు. ఇక్కడ డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, రేషన్ డీలర్ల అధ్యక్షుడు రెడ్డిమల్ల హనుమండ్లు, కొండ పద్మ, వీ మమత, ఆడెపు సౌజన్య, జిందం రేఖ, బండారి శారద, తాటి పద్మ ఉన్నారు.

## భూస్వాములకు పెత్తందారులకు సింహ స్వప్నం చాకలి ఐలమ్మ

**కోనరావుపేట మండల అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా పనిచేస్తా...**

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్...**



*కోనరావుపేట, సెప్టెంబర్ 26, ప్రజాజ్యోతి*

రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రంలోని రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన చిట్యాల చాకలి ఐలమ్మ 129వ జయంతి వేడుకలకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరై ఆమె విగ్రహానికి పూలమాల వేసి ఘననివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం, భూస్వాములతో, పెత్తందారులతో పోరాడి తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని, ప్రపంచానికి చాటి చెప్పిన నిప్పు కణిక,యావత్ మహిళా లోకానికి స్ఫూర్తి దాయిని

మిగతా 2లో... ▸

## తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ

**అడిషనల్ డీసీపీ ఎ. లక్ష్మీనారాయణ**

*కరీంనగర్‌క్రైమ్, సెప్టెంబర్ 26, ప్రజాజ్యోతి*

తెలంగాణ వీర వనిత,తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు కరీంనగర్ పోలీసు కమీషనరేట్ కార్యాలయములో గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అడిషనల్ డీసీపీ ఎ.లక్ష్మీనారాయణ హాజరై చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భముగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ నిరంకుశంగా వ్యవహరించిన రజాకార్లకు,జమీందార్లకు,దొరలకు వ్యతిరేఖంగా మొక్కవోని ధైర్యంతో ఐలమ్మ ఎదిరించిన తీరు అందరికీ ఆదర్శమని ఆమె చేసిన పోరాటాలను కొనియాడారు.ఆమె చేసిన భూపోరాట ఉద్యమమే తెలంగాణ సాయుధ పోరాటానికి స్ఫూర్తి అని అన్నారు.మహిళా చైతన్యానికి, ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఎ.ఆర్.అనోక్ జై కుమార్,ఆర్.ఐ. లు రజినీకాంత్ అడ్మిన్,శ్రీధర్ రెడ్డి వెల్ఫేర్ ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.




## సంక్షేమ అధికారులు హాస్టల్లో తప్పనిసరిగా నిద్ర చేయాలి

**ఎంఈఓలు, ప్రత్యేక అధికారులు నిరంతరం హాస్టళ్ళను పర్యవేక్షించాలి**

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

*కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 26, ప్రజాజ్యోతి*

జిల్లాలోని అన్ని విద్యార్థి వసతి గృహాలను హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు నిరంతరం పర్యవేక్షించాలని, హాస్టల్ లో రాత్రి నిద్ర చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన బోజనం అందించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. మండల విద్యాధికారులు, మండల ప్రత్యేక అధికారులు హాస్టళ్ళను సందర్శించాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, సోషల్ వెల్ఫేర్ హాస్టల్ అధికారులు, మండల విద్యాధికారులతో గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి వసతి గృహంలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా పనిచేసే విధంగా చూడాలని ఆదేశించారు. ఇతరులను హాస్టల్లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించకూడదని అన్నారు. కంప్యూటర్ ల్యాబ్, డైనింగ్ టేబుల్ వంటి సౌకర్యాలను విద్యార్థుల కోసం తప్పనిసరిగా వినియోగించాలని ఆదేశించారు.హాస్టల్లకు సరఫరా అవుతున్న స్టాక్ వివరాలను వెల్ఫేర్ అధికారులు పరిశీలించి



నాణ్యమైన సరుకులను మాత్రమే తీసుకోవాలని అన్నారు. అన్ని హాస్టల్లో ఆర్వో వాటర్ ప్లాంట్లు వినియోగించాలని అన్నారు. వసతి గృహాల్లో ఉండే విద్యార్థులు తప్పనిసరిగా పాఠశాలకు వెళ్లేలా చూడాలని ఆదేశించారు. వసతి గృహం నుండి పాఠశాల, కళాశాలకు హాజరవుతున్న విద్యార్థుల హాజరు వివరాలను ఎప్పటికప్పుడు తెప్పించుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి విద్యార్థికి హాజరు శాతం ఎక్కువగా ఉండేలా చూడాలని, హాస్టల్లో ఇంటి వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. విద్యార్థులు ప్రేరణ పొందే మంచి సినిమాలను వారంలో ఒకసారి హాస్టల్లో ప్రదర్శించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీ కిరణ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డిఆర్ఓ పవన్ కుమార్, డీఈఓ జనార్ధన్ పాల్గొన్నారు.

## పాత్రికేయుడి కుటుంబాన్ని పరామర్శించిన జువ్వాడి కృష్ణారావు



మల్లాపూర్, సెప్టెంబర్ 26, ప్రజాజ్యోతి

మల్లాపూర్ మండలంలోని సాతారం గ్రామానికి చెందిన జనం సాక్షి పత్రిక విలేకరి వుడుగుల గంగాధర్ తండ్రి ఇటీవల మరణించగా గంగాధర్ కుటుంబ సభ్యులని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు పరామర్శించారు. జువ్వాడి కృష్ణారావు వెంట కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంతం రాజం, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కిషన్ గౌడ్, మాజీ ఎంపీటీసీ కొప్పెర హనుమంతు, బడే భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

## భూస్వాములకు పెత్తందారులకు సింహ స్వప్నం చాకలి ఐలమ్మ...



(మొదటి పేజీ తరువాయి...)

వీరనారి చాకలి ఐలమ్మ అని అన్నారు. ఐలమ్మ పోరాటపటిమను, స్ఫూర్తిని ఈనాటి యువతరం అందిపుచ్చుకోవాలని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 70 ఏళ్ల చరిత్ర కలిగిన కోటి మహిళా యూనివర్సిటీ కి చాకలి ఐలమ్మ పేరును పెట్టడం హర్షించదగ్గ విషయమని ఆన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం గల్ఫ్ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, కార్మికుల కోసం ప్రతి ఏటా 100 కోట్లు నిధులు కేటాయించి వలస బతుకులు మారుస్తామని ఇచ్చిన ఎన్నో హామీలను తుంగలో తొక్కిందని, గడిచిన తొమ్మిదిన్నర సంవత్సరాలలో గల్ఫ్ కార్మికులు సుమారు 2300 మంది మరణించిన ఏ ఒక్క కుటుంబానికి అనపైసా కూడా ఇవ్వలేదని ఆన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుందని, దురదృష్టవశాత్తు గల్ఫ్ లో కార్మికులు ఎవరైనా మరణిస్తే వారి కుటుంబానికి 5 లక్షల రూపాయలను ఇచ్చి ఆదుకుంటున్నామని తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే విధంగా నేడు తెలంగాణ ప్రభుత్వం ప్రవాస్ దివాస్ అనే పేరుతో గల్ఫ్ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ విజయప్రకాశ్ రావు, రజక సంఘం నాయకులు కరుణాకర్ చంద్రయ్య వెంకటి, సతీష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చేపూరి గంగాధర్, నాయకులు సంగీతం శ్రీనివాస్, కచ్చకాయల ఎల్లయ్య గొట్టే రుక్మిణి మాంధాల లింబయ్య మానుక సత్యం, పెంతల శ్రీనివాస్, నాగండ్ల భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వార్షిక తనిఖీల్లో భాగంగా కరీంనగర్ రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి

కరీంనగర్ క్రైమ్, సెప్టెంబర్ 26, ప్రజాజ్యోతి



కరీంనగర్ కమీషనరేట్ పరిధిలోని టౌన్ డివిజన్ లో గల టూ టౌన్ పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారంనాడు కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి, ఐపీఎస్ తనిఖీ చేసారు. పోలీస్ స్టేషన్ లో గల పెండింగ్ కేసులపై సమీక్ష చేసారు. వాటికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన వాటిని పూర్తి చేయాలనీ సూచించారు. స్టేషన్ నందు పని చేస్తున్న సిబ్బందిని నామినల్ రోల్ ఆధారంగా ప్రతీ ఒక్కరిని పిలిచి, ఎవరెవరికి ఏయే విధులు కేటీయించబడ్డాయని వారు నిర్వహిస్తున్న విధులగురించి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. విసిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టిపెట్టి క్షేత్రస్థాయిలో ఫలితాన్నిచ్చే విధంగా సందర్శనలు ఉండాలన్నారు. స్థానికంగా ఉండే శాంతి భద్రతల సమస్యలు, రౌడీ షీటర్లు మరియు హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రతి నెల వారికి సంబందించిన నూతన సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి నమోదు చేసుకోవాలన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో అధికారుల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. పెండింగ్ వారెంట్ల అమలు చేయాలన్నారు. 100 డయల్ కాల్స్ కి త్వరితగతిన స్పందించాలన్నారు. ఫిర్యాదులు అందిన వెంటనే సంఘటనాస్థలానికి చేరుకొని సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. అక్రమ ఇసుక రవాణా, పి.డి.ఎస్. బియ్యం రవాణా, మద్యం బెల్టు షాపుల నిర్వహణ వంటి అక్రమ కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపి, పట్టుబడిన వారిపై తగిన కేసులు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ డివిజన్ ఏసీపీ గోపతి నరేందర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ. ఇన్స్పెక్టర్ పిట్టల విజయ్ కుమార్ ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లుల సమస్యను పరిష్కరించాలి

### పాత పెన్షన్ విధానం ప్రవేశపెట్టాలి

### నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలి

### టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి

కొత్తపల్లి, సెప్టెంబర్ 26, ప్రజాజ్యోతి



ఉద్యోగుల పెండింగ్ బిల్లులను ఇప్పించాలని, పాత పెన్షన్ విధానం అమలుచేయాలని టీఎన్జీవోస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగులు ఇప్పటికే రెండు పీఆర్సీలు నష్టపోయారని, న్యాయం జరిగేలా చూడాలని, జూలై ఒక టో నుంచి పీఆర్సీని అమలు చేసి మానిటరీ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. జిల్లాకేంద్రంలోని టీఎన్జీవోల సంఘ భవనంలో గురువారం సంఘ కార్యవర్గ సమావేశం నిర్వహించి, పలు అంశాలపై ఏకగ్రీవ తీర్మానం చేశారు. అలాగే ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ఒకటో తేదీన జీతం ఇవ్వడంపై ముఖ్యమంత్రికి ఉద్యోగుల పక్షాన శ్రీనివాస్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సరెండర్‌లీవ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, పిల్లల పెళ్లిలకని విత్ డ్రా చేసుకున్న జీపీఎఫ్ ఖాతాలోని డబ్బులు రాక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్ ఉద్యోగులు అనేక రకాల సమస్యలతో సతమతమవుతున్నారని, నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం ప్రవేశపెట్టేలా ప్రభుత్వం అడుగులు వేయాలని కోరారు. ప్రభుత్వం జీవో నెంబర్ 79 విడుదల చేసిన క్రమంలో కలెక్టర్ యుద్ధప్రతిపాదికన కారుణ్య నియామకాలు చేపట్టి వా రి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ప్రభుత్వోద్యోగుల భాగస్వామ్యంతో నగదు రహిత వైద్యం అందించేలా వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కుబేర్ ద్వారా కాకుండా పాత పద్ధతి ద్వారా జీతభత్యాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పంచాయతీలు, హెడ్‌డబ్ల్యూ, అగ్రికల్చర్ ఆఫీసర్లకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిషరించాలన్నారు. అలాగే అన్ని జిల్లాలోని యూనిట్లు, డిపార్ట్‌మెంట్ ఫోరం సభ్యత్వ నమోదు కార్యక్రమం, సర్వసభ్య సమావేశాలు చేపట్టి ఎన్నికలు నిర్వహించి సంఘాన్ని బలోపేతం కృషి చేయాలని సూచించారు. పై సమస్యలపై టీఎన్జీవో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు తీర్మానాలు ప్రవేశపెట్టగా సభ్యులందరూ ఆమోదించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల న్యాయమైన సమస్యలు వెంటనే పరిషరించాలని, లేదంటే కేంద్ర సంఘం ఇచ్చే పిలుపు మేరకు నిరసన కార్యక్రమాలు చేపట్టి, సమస్యలు పరిషరించుకునే దిశగా ముందుకు సాగుతామన్నారు. ఈ సమావేశంలో టీఎన్జీవోల కేంద్ర సంఘం నాయకులు నాగుల నరసింహస్వామి, కోశాధికారి ముప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, మహిళా జేఏసీ చైర్మన్ ఇరుమళ్ల శారద, అర్బన్ అధ్యక్షుడు సర్దార్ హర్మీందర్‌సింగ్, కార్యదర్శి వెలిచాల సుమంత్ రావు, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, కార్యదర్శి నేరెళ్ల కిషన్, తిమ్మాపూర్ అధ్యక్షుడు పోలు కిషన్, కార్యదర్శి అంబటి నాగరాజు, చొప్పదండి అధ్యక్షుడు కామ సతీశ్, కార్యదర్శి లవ్‌కుమార్, హుజురాబాద్ అధ్యక్షులు చింతల సందీప్, జమ్మికుంట అధ్యక్షులు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ సిటీ నిధుల వినియోగంపై యూసీ ఎందుకివ్వలే?

కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 26, ప్రజాజ్యోతి

స్మార్ట్ సిటీ మిషన్ లో భాగంగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి రూ.30.62 కోట్ల నిధులు విడుదలై 3 నెలలైనా ఇంతవరకు నిధుల వినియోగంపై యుటిలైజేషన్ సర్టిఫికేట్ (యూసీ) ఎందుకివ్వలేదని బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, మాజీ అధ్యక్షులు బాస సత్యనారాయణ గురువారం విడుదల చేసిన ప్రకటనలో ప్రశ్నించారు. స్మార్ట్ సిటీ పనుల ప్రగతికి సంబంధించిన నిధుల విషయంలో కేంద్రం తన వాటా కింద 3 నెలల క్రితమే 30.62 కోట్ల రూపాయలు నిధులు విడుదల చేసినా, రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను ఏ యే పనులకు వినియోగించిందో తెలపాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో కేంద్రంతో సమానంగా రాష్ట్రం విడుదల చేయాల్సిన రూ.30.62 కోట్లను ఇంతవరకు ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. నిధుల వినియోగంపై యూసీలిస్తే...సుమారు మరో రూ.100 కోట్ల మేరకు నిధులను విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు కేంద్రం సంసిద్ధత వ్యక్తం చేసినప్పటికీ రాష్ట ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. ఈ ఏడాది మార్చి 31 నాటితో స్మార్ట్ సిటీ మిషన్ గడువు ముగుస్తున్న నేపథ్యంలో తక్షణమే కేంద్ర నిధుల నిధుల వినియోగంపై యూసీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**స్మార్ట్ సిటీ నిధుల వినియోగంపై యూసీ ఎందుకివ్వలే?**

**రాష్ట్ర వాటాను ఇంతవరకు ఎందుకు విడుదల చేయలేదు?**

**కేంద్రం మరిన్ని నిధులిచ్చేందుకు సిద్ధంగా ఉన్నా యూసీ జారీలో జాప్యమేల?**

**రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన బీజేపీ నేతలు గంగాడి క్రిష్ణారెడ్డి, బాస సత్యనారాయణ**